క్లుప్తంగా

మూలపెద్దమ్మకు భక్తుల పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఉదయం అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులకు ప్రవేశం కల్పించడంతో వారు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, అక్కంపల్లె, ఇంజేడు, కొండుపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

నంద్యాల: బాధ్యత గల పౌరుడుగా వ్యవహరించాల్సిన మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పోలీసులను సంఘవిద్రోహ శక్తులుగా అభివర్ణించడం తగదని. వెంటనే వారికి క్షమాపణ చెప్పాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పద్మావతినగర్‌లో జీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 40ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకొనే చంద్రబాబు పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించడం మంచి పద్ధతా అని ప్రశ్నించారు. తన స్వార్థం కోసం బహిరంగ సభలో పోలీసు వ్యవస్థను కించపరిచేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర కార్యదర్శి రవినాయక్, జిల్లా అధ్యక్షుడు బాలునాయక్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ నుంచి పోటీకి సై

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలుగుదేశం పార్టీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ ఆదేశిస్తే ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ తరుపున పోటీ చేస్తానని చెప్పారు. నియోజవర్గ రాజకీయాలతో తనకు 35 సంవత్సరాలుగా విడదీయని అనుబంధం ఉందన్నారు. పార్టీ చేసిన సర్వే సర్వేలో కూడా తనకు అనుకూలంగా ఫలితాలు వచ్చాయని తెలిసిందన్నారు.

భారత కీర్తిని చాటిన ధీరుడు ఛత్రపతి



చాగలమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: భారత కీర్తిని ప్రపంచ దేశాలకు చాటిన ధీరుడు ఛత్రపతి శివాజీ అని హిందూ ఐక్య సంఘం సభ్యుడు వేదచైతన్యస్వామి కొనియాడారు. ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం చాగలమర్రిలో హిందూ ఐక్య సంఘం ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటంతో భారీ ర్యాలీ చేపట్టారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాశిరెడ్డినాయన

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కల్పనా సెంటర్‌లో వెలసిన శ్రీకాశిరెడ్డి నాయన ఆశ్రమంలో ఆదివారం సాయంత్రం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు సుబ్బశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకాలు, గంధాభిషేకం, సహస్ర జలాభిషేకం చేసి పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం మహామంగళ హారతులు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆశ్రమ గౌరవాధ్యక్షుడు డాక్టర్ గోపాల్‌రెడ్డి, చక్రపాణి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహానందిలో వైభవంగా పుష్ప పల్లకోత్సవం



మహానందీశ్వరస్వామి, కామేశ్వరీదేవి ఉత్సవమూర్తులను పుష్ప పల్లకీపై ఆశీనులు గావించి పూజలు చేస్తున్న దృశ్యం

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహానందిలో ఆదివారం తెల్లవారుజామున మహానందీశ్వరస్వామి, కామేశ్వరీదేవిల కల్యాణోత్సవం కనులపండువగా జరుగగా, రాత్రి స్వామి, అమ్మవార్ల పుష్పపల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పుష్పపల్లకీల్లో కొలువుంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నాటి సంత విశేషాల పుంత

నంద్యాల పట్టణంలో ప్రతి శనివారం నిర్వహించే సంతకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. గతంలో ఈ సంతకు 80 గ్రామాల నుంచి ప్రజలు వచ్చేవారు. మద్రాసు, మహబూబ్ నగర్, కడప, దువ్వూరు, మైదుకూరు తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చేవారు. ఈ సంతలో దొరకని వస్తువు లేదంటే అతిశయోక్తి కాదు. పాత దుస్తులు, బీడీలు, నశ్యం, కూరగాయలు, వ్యవసాయ, ఇంటి పరికరాలు, నిత్యావసర సరుకులు, మిఠాయిలు తదితరాలు గుడారాలు, మంచాలపై ఉంచి విక్రయించేవారు. నిర్వాహకులు మైకుల ద్వారా, ఒంటెద్దు బండ్లపై ప్రచారం చేసి తమ వస్తువులను విక్రయించే వారు. వేసవిలో శీతల పానియాల బండ్లు, గోలీ సోడా తోపుడు బండ్ల వద్ద జనం గుమిగూడేవారు.

- 80 గ్రామాలకు ఆధారంగా నంద్యాల సంత
- పాత దుస్తులకు కేరాఫ్ అడ్రస్‌గా ఆత్మకూరు బస్టాండ్
- వారపు సంతకు శతాబ్దానికి పైగా చరిత్ర
- ప్రతి శనివారం నిర్వహణ

నంద్యాల(అర్బన్): నంద్యాల వారపు సంతకు శతాబ్దానికి పైగా చరిత్ర ఉంది. సంత జరిగే ప్రాంతానికి సంత గేటు అని పేరు ఉండేది. రానురాను ఆ పేరు ఆత్మకూరు బస్టాండ్‌గా వాడుకలోకి వచ్చింది. సంతలో మంచాలు, గుడారాలు వేసుకొని వ్యాపారం చేసుకొనేవారు. ప్రస్తుతం ఆ స్థలాన్ని మున్సిపాలిటీ ఇతర ప్రయోజనాలకు కేటాయించింది.

సంతకు నాలుగు ఎకరాల పొలం దానం..

వందేళ్ల క్రితం రోడ్లపై సంత జరగడాన్ని గమనించి పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ దేశాయ్ కుప్పారావు తనకున్న నాలుగు ఎకరాల పొలాన్ని వారపు సంత కోసం మున్సిపాలిటీకి ఇచ్చారు. ఈ స్థలంలోనే దాదాపు 40 ఏళ్ల క్రితం వరకు సంత జరిగింది. రానురాను సంతకు ప్రాధాన్యం తగ్గిపోయింది. స్థలం నుంచి బయటకు వచ్చి వ్యాపారులు కొందరు రోడ్లపై వ్యాపారం చేయడం ప్రారంభమైంది. దీంతో మున్సిపాలిటీ ఆ స్థలాన్ని వివిధ అభివృద్ధి పనులకు కేటాయించింది. ఈ క్రమంలోనే ఎన్‌టీఆర్ షాదీఖానా, మున్సిపల్ ఉర్దూ పాఠశాల, ఫిల్టర్ హౌస్ ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం పాత దుస్తుల విక్రయాలన్నీ సంత గేటు రోడ్డు మీదనే జరుగుతున్నాయి. ప్రతి శనివారం ఇప్పటికీ అక్కడక్కడ పాత దుస్తులు, ఎండు చేపల వ్యాపారం జరుగుతున్నా.. నాటి సందడి కనిపించడం లేదు.

చరిత్ర..

శతాబ్దం క్రితం ప్రస్తుతం ఉన్న మహానందీశ్వర స్వామి విడది మండపం నుంచి ప్రకాశం మెమోరియల్ పురపాలక ఉద్యానవనం (సంతగేటు పాఠశాల) వరకు వారపు సంత జరిగేది. ప్రతి శనివారం నిర్వహించే ఈ సంతలో 40 నుంచి 50 వరకు వివిధ రకాల దుకాణాలు వెలిసేవి. ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ ప్రాంతం సందడిగా సాగేది. అప్పట్లో చిన్నారులు, యువకులను సంత అందాలు, సందడి, కోలాహలం, ఉక్కిరిబిక్కిరి చేసేది. నాడు వేసవి కాలంలో సంతలో శీతల పానియాల తోపుడు బండ్లు, గోలీసోడా బండ్ల వద్ద అధిక గిరాకీ ఉండేది. వీటి రుచి, రంగును పలు రకాలుగా వర్ణిస్తూ, పాటలు పాడుతూ విక్రయించడం ఆకట్టుకునేది.

ఆ గ్రామాలన్నీ సంతకు..

గతంలో ఏ తాలూకాకు లేని ప్రత్యేకత నంద్యాలకు ఉండేది. దీని పరిధిలో 72 గ్రామాలు ఉండేవి. ప్రస్తుతం శ్రీశైలం నియోజకవర్గంలో ఉన్న వెలుగోడు నుంచి పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కొలూరు, బలపనూరు వరకు, కోవెలకుంట్ల మార్గంలోని రేవనూరు, ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని శిరివెళ్ల వరకు ప్రజలు నంద్యాల వారపు సంతకు వచ్చేవారు.

జోరుగా బీడీల వ్యాపారం..ప్రచారం..

అప్పట్లో సినిమా ప్రచారం ప్రత్యేకంగా ఉండేది. ఒంటిద్దు బండ్లపై సంతలో మైకుల ద్వారా ప్రచారం చేసేవారు. నంద్యాలలో నిర్వహించే సంతకు మద్రాసు నుంచి తాజ్‌మహల్ బీడీ వాళ్లు వచ్చి ప్రచారం చేయడంతో పాటు విక్రయాలు చేసేవారు. మద్రాసు జాడీ బీడీ వారు కూడా ప్రచారం చేసేవారు. అప్పట్లో మద్రాసు నుంచి వీరు ప్రత్యేకంగా వ్యాన్‌లలో వచ్చేవారు. ఇక స్థానిక ప్రచారం నిర్వహించే చిన్న పాటి వాహనాలు నాటు పద్ధతిలో ఉండేవి. మహబూబ్‌నగర్ జిల్లా చింతకుంట నుంచి రెడ్డి జాడీ బీడీ వారు మైక్‌లతో హోరెత్తించే వారు. కడప, దువ్వూరు, మైదుకూరు నుంచి కలశం జాడీ బీడీ, గోపురం బీడీ వ్యాన్లు వచ్చేవి. అప్పట్లో సంతకు వచ్చే వారు హోల్‌సేల్‌గా బీడీలను కొనుగోలు చేసేవారు. నంద్యాల పట్టణంలో సాదాగర్ బీడీ వాళ్లు కూడా ప్రచారం చేసేవారు.



మంచాలపై దుస్తుల దుకాణాలు ఏర్పాటు చేసిన దృశ్యం

విశేషాలు ఎన్నెన్నో...

నాడు జరిగే సంతలో బోలెడు విశేషాలు ఉండేవి. లోపల, బయట సంతలు జరిగేవి. బియ్యం, కందిపప్పు, బురుగులు, కూరగాయలు ఒకటేమిటి అన్నీ రాసులు పోసి అమ్మేవారు. సంతలోకి ప్రవేశించగానే బయట పాత దుస్తులు, కూరగాయలు, రైతులకు ఉపయోగపడే పనిముట్లు వంటివి దర్శనమిచ్చేవి. సేరు, అర్ధసేరు, పావుసేరు చొప్పున అమ్మకాలు జరిగేవి. ఇక లోపలికి వెళితే మిఠాయిలు, ఎండు మిరపకాయలు, కొత్త వస్త్రాల దుకాణాలు కనిపించేవి. పాలు, పెరుగు,నెయ్యి, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు బుట్టల్లో తెచ్చి అమ్మేవారు. ఇక సంతలో విక్రయించే మిఠాయిల్లో వివిధ రకాల ప్రత్యేకతలు కనిపించేవి. బెల్లం పుల్లలు, భక్ష్యాలు, కర్జికాయలు, అత్తరాసలు, లేవడాలు, పకోడ, పాలకోవ, మైసూర్‌పాక్ ఉండేవి. సంత కోసం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కొందరు ముందురోజు రాత్రికి వచ్చి పట్టణంలో ఏదో ఒక సినిమా చూసి రామనాథ్ థియేటర్ ఎదుటనున్న ఆవరణలో నిద్రించి మరుసటి రోజు సంత చూసుకొని గ్రామాలకు తిరిగి వెళ్లేవారు.

అన్ని రకాల వస్తువులు దొరికేవి



అప్పట్లో నాకు 18 ఏళ్ల వయస్సు. శనివారం జరిగే సంత ఎప్పుడూ సందడిగా ఉండేది. సంత ఏరోజు వస్తుందోనని ఎదురు చూసేవాళ్లం. అమ్మతో కలిసి సంతకు వెళ్లిన ప్రతి సారి అత్తరాసలు తిని, గోలీ సోడ తాగేవాడిని. అమ్మ వారానికి సరిపడ సరుకులు తీసుకుంటుంటే సంతలో జరిగే సదండి, కోలాహలం చూస్తూ సంబర పడేవాడిని. స్నేహితులతో కలిసి వెళ్లినప్పుడు పుల్ల ఐస్ తిని పులకించి పోయే వాళ్లం. సంతలో అన్నీ దొరికేవి.

– లింగన్న, రిటైర్డు ఆర్టీసీ కండక్టర్, కురువపేట, నంద్యాల

వేసవి కాలంలో శీతల పానీయాలు తాగేవాళ్లం



శనివారం జరిగే సంత ఎప్పుడు ప్రజలతో కిక్కిరిసి ఉండేది. ఎక్కడ ఏం వ్యాపారం ఉందో కనుక్కోవడం కష్టమనిపించేది. సంత అంత కలియ తిరిగితే ఇంటికి అవసరమైన వస్తువులు దొరికేవి. సంతకు వచ్చిన ప్రతి సారి ఇంటికి బొరుగులు, మిక్చర్ తీసుకొని వెళ్లేవాళ్లం. వేసవి కాలంలో తోపుడు బండ్ల కలర్ గోలీసోడాలు, కుండల్లోని చల్లని మజ్జిగ తాగేవాళ్లం. నేడు ఆ వాతావరణం లేదు.

–హైమావతి, గృహిణి, గుడిపాటిగడ్డ

కమనీయం..ఆది దంపతుల కల్యాణం





ప్రథమనంది ఆలయంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): ఆది దంపతులైన శివపార్వతుల కల్యాణం పట్టణంలోని శైవ క్షేత్రాల్లో శనివారం అర్ధరాత్రి మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, లింగోద్భవ కాలం అనంతరం వైభవంగా నిర్వహించారు. ప్రథమనందీశ్వర, సోమనందీశ్వర , సమజీవనగర్ రామాలయం, ఎన్‌కే రోడ్డులోని, రోజాకుంటలోని నాగలింగేశ్వర ఆలయాలు, మల్లికార్జునస్వామి, కాళికాంబ చంద్రశేఖర తదితర దేవాలయాల్లో ఆదివారం తెల్లవారుజామున 4గంటల వరకు కల్యాణోత్సవ కార్యక్రమాలను నిర్వాహకులు జరిపించారు. పండితుల మంత్రోచ్ఛరణలతో గణపతి పూజతో ప్రారంభమై పుణ్యాహవాచనం, స్వామివారికి కంకణ ధారణ, తిలకధారణ, జీలకర్రబెల్లం, తాళిబొట్టు కార్యక్రమం, స్వామి అమ్మవార్లకు తలంబ్రాలు అనంతరం సదివింపుల కార్యక్రమం నిర్వహించారు. వేడుకకు భారీగా భక్తులు హాజరయ్యారు.

- ప్రథమనందీశ్వర ఆలయంలో ప్రథనందీశ్వరుడు, కేదారేశ్వరి మాతకు కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. సంజీవనగర్ రామాలయంలో కాశీవిశ్వనాథుడికి లింగోద్భవ సమయాన అష్టోత్తర కలశ, క్షీరాభిషేకం నిర్వహించి అనంతరం స్వామి, అమ్మవార్లకు వేదపండితుల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం స్వామి అమ్మవార్లను గ్రామోత్సవం జరిపించారు.

ఆళ్లగడ్డ: మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి అనంతరం శివపార్వతుల కల్యాణం వైభవంగా కొనసాగింది. రామతీర్థ పుట్టాలమ్మ క్షేత్రంలో కొలువైన శ్రీ పరుశరామ లింగేశ్వరస్వామి, భ్రరాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రహోమం అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి పెళ్లి పీఠలపై కొలువుంచి పండితుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ మంగళ్య ధారణ కార్యక్రమం వేడుకగా జరిపించారు. చివరగా ముత్యాల తలంబ్రాలతో కార్యక్రమాన్ని ముగించారు.



రామతీర్థ పుట్టాలమ్మ క్షేత్రంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

దొర్నిపాడు: స్థానిక సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం శనివారం లింగోద్భవకాలంలో కమనీయంగా సాగింది. కల్యాణాన్ని తిలకించేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అర్చకులు నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆదివారం శివపార్వతుల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం చేపట్టారు.



దొర్నిపాడులో శివపార్వతులను ఊరేగిస్తున్న దృశ్యం

గోస్పాడు: మండంలోని గ్రామాల్లో ఆదివారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. యాళ్లూరులో శ్రీ ఉమా సహిత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.



ప్రత్యేక అలంకరణలో ఉమా సహిత నీలకంఠేశ్వరస్వామి





కుందూ బ్రిడ్జి వద్ద నుంచి ఈద్గా వరకు ఇలా..





ఈద్గా నుంచి నందమూరినగర్ క్రాస్ రోడ్డు వరకు

టిడ్కో గృహాల రహదారికి మహర్దశ

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో గృహాలను అర్హులైన పేదలకు అందజేసింది. గృహాల్లో అవసరమైన వసతులు కల్పించడమే కాకుండా రాకపోకలకు అవసరమైన రహదారి ఏర్పాటుకు నిధులు కేటాయించింది. జనరల్ ఫండ్ కింద మంజూరైన రూ.81లక్షల్లో రూ.51లక్షలతో రహదారి పనులు పూర్తి చేశారు. మిగిలిన రూ.30 లక్షలతో కల్వర్టు పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. గతంలో రహదారి గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందికరంగా మారడంతో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి స్పందించి జనరల్ ఫండ్ కింద నిధులు మంజూరు చేయించారు. రోడ్లను రూపుదిద్దడంతో టిడ్కో గృహాలు, ఎస్సార్బీసీ, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పాయి.





నందమూరినగర్ క్రాస్ రోడ్డు నుంచి టిడ్కో గృహాల వరకు ..

రైతులు బాగుంటేనే దేశం బాగుంటుంది

మహానంది: రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతుల సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్లబల ప్రదర్శన పోటీలు ప్రారంభించారు. ఎమెల్యే మాట్లాడుతూ ఎడ్ల యజమానులను ప్రోత్సహించేందుకు రాష్ట్రస్థాయి రైతు సంబరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెలుగుగంగ కాల్వతో పాటు కేసీ కాల్వకు సమృద్ధిగా నీరు అందించి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. అధికారంలో ఉన్నా రైతుల శ్రేయస్సు కోసం పోరాడేందుకు ఎప్పటికీ శిల్పా కుటుంబం సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మహానందిలో ఎడ్లపందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

కృష్ణాజిల్లా వృషభాల జయకేతనం

డీవీఆర్ మెమోరియల్ దేవభక్తుని సుబ్బారావు, కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరుకు చెందిన వృషభాలు మొదటి స్థానంలో నిలవగా రూ1.25లక్షల నగదును ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఆర్‌కే బుల్స్ గుంటూరు జిల్లా వేటపాలెం ఎద్దులు ద్వితీయస్థానం సాధించగా రూ. 80వేల నగదును కొండా మధుసూదన్‌రెడ్డి, పులగం కృష్ణారెడ్డి, జస్వితారెడ్డిల వృషభాలు మూడోస్థానంలో నిలవగా రూ. 60వేల నగదును శీలం హరీష్‌రెడ్డి అందజేశారు. ఐలూరి మురళీకృష్ణారెడ్డి, , సురేంద్రారెడ్డి, సూర్యాపేట తెలంగాణ వృషభాలు నాలుగోస్థానంలో నిలవగా రూ. 40వేల నగదును శవ్వా మనోహర్‌రెడ్డి, శవ్వా శరభారెడ్డి బ్రదర్స్, వైడీఆర్ బుల్స్ రంగారెడ్డి జిల్లాకు చెందిన ఐదోస్థానంలో నిలువగా రూ. 30వేలు నగదు బహుమతిని సబ్బసాని అశోక్‌రెడ్డి అందించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

- విజేతలుగా నంద్యాల మండలం పెద్ద కొట్టాల ఎద్దులు, రెండో స్థానంలో మైదుకూరు వృషభాలు

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. న్యూ క్యాటగిరీ విభాగంలో నంద్యాల మండలం పెద్దకొట్టాలకు చెందిన కేశవరెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన వెంకటేష్ యాదవ్ వషభాలు రెండో స్థానంలో, చిన్నకానాలకు చెందిన చెన్నారెడ్డి ఎద్దులు మూడో స్థానం, వైఎస్సార్ జిల్లా కలపాకు చెందిన వెంకటరెడ్డి ఎద్లు నాల్గవ స్థానంలో నిలిచాయి. వనికినిదెన్నెకు చెందిన శరబయ్య వృషభాలు ఐదో స్థానంలో, వైఎస్సార్ జిల్లా కొట్టాలకు చెందిన అంకిరెడ్డి ఎద్దులు ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ. 50 వేలు, రూ. 40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు నగదును నిర్వాహకులు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు.

కృష్ణనంది క్షేత్రంలో..

కృష్ణనంది క్షేత్రంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆరు పండ్ల విభాగంలో జరిగిన ఈ పోటీల్లో పాణ్యం మండలం ఎస్.కొత్తూరుకు చెందిన వృషభాలు, ఇదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యేశ్వరరెడ్డి ఎద్దులు, పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన పల్లవి వృషభాలు తొలి మూడు స్థానాలు కైవసం చేసుకున్నాయి. వైఎస్సార్ జిల్లా కలసపాడు వీరతేజరెడ్డికి చెందిన వృషభాలు, అదే జిల్లా పాతసంగటి పల్లెకు చెందిన సుబ్బారెడ్డి ఎద్దులు, నంద్యాల మండలం ఉయ్యాలవాడకు చెందిన మహమ్మద్ ఖాసిం వృషభాలు , బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామానికి చెందిన నాగేష్, సంజామల మండలం లింగందిన్నె గ్రామానికి చెందిన మేకల దీప్తికి చెందిన వృషభాలు ఆతరువారి స్థానాల్లో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.45వేలు, రూ.35వేలు, రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదు బహుమతులను వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆళ్లగడ్డ: రూరల్ మండలం బత్తలూరు గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నపురెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బత్తలూరు గ్రామానికి చెందిన చెన్నపురెడ్డి సొంత పనిమీద ఆళ్లగడ్డకు వచ్చి మోటార్ సైకిల్‌పై గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని బైపాస్ రోడ్డు నుంచి కిందకు దిగుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను పోలీసులు 108 అంబులెన్స్ ద్వారా నంద్యాల వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాయినపల్లెకు చెందిన రాజశేఖర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై సంజామల మండలం పేరుసోములకు వెళ్తుండగా తిమ్మనాయినపేట నుంచి పేరుసోములకు వెళ్లే ప్రధాన రహదారిలో మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. బైక్, ఆటో ఢీకొనడంతో రాజశేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను 108 వాహన సిబ్బంది కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



జగన్నాథ్, బలదేవ్, సుభద్రకు హారతి ఇస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు పేర్కొన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం ఇస్కాన్‌లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్గీత పఠనం, హరే రామ హరే కృష్ణ సంకీర్తన జపం చేశారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు మహా రాజ భోగ నివేదన చేసి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

సోషల్ ఆడిట్ వేదిక మార్పు

పాణ్యం: ఉపాధి హామీ పథకం కింద 2021–23 సంవత్సరానికి సంబంధించి చేసిన పనులపై ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించాల్సిన బహిరంగ సమావేశాన్ని మరో చోటికి మార్పు చేసినట్లు ఏపీఓ విజయరాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 21న నంద్యాల జిల్లాలోని పాండురంగాపురం సీఎల్ఆర్‌సీ కార్యాలయం వద్ద సమావేశం జరుపునున్నట్లు వెల్లడించారు.